క్లుప్తంగా

బ్యాంకు అకౌంట్ ఉన్నవారికి పోస్టల్ ఖాతా తప్పని సరి కాదు

పెడన: ఏ బ్యాంకులో అయినా ఖాతా(అకౌంట్) ఉన్న వారికి దానికి ఆధార్ లింకు అయి ఉంటే పోస్టల్ ఖాతా తెరవాల్సిన పని లేదని మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ ఖాతా ఉంటేనే ప్రభుత్వ పథకాలు వస్తాయనే విషయాన్ని సోషల్ మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు వాస్తవం కాదని పేర్కొన్నారు. చాలా మంది మహిళలు బ్యాంకు ఖాతాలున్నా మళ్లీ పోస్టాఫీసుకు వెళ్లి రూ.200 కట్టి పోస్టల్ ఖాతాలను తెరుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అదీ కాకుండా ఈ నెల 30వ తేదీలోగా ఖాతా తెరవాలనే విషయం అవాస్తవమని ప్రజలు గమనించాల్సిందిగా సూచించారు. ఎన్‌పీసీఐ వెరిఫికేషన్ ప్రతి వార్డు సచివాలయంలో కూడా చేస్తారని సంప్రదించాల్సిందిగా సూచించారు.

డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలి

పెడన: డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మెప్మా స్వయం సహాయ సంఘాలతో అర్బన్ మహిళా మార్కెట్ (మెప్మా బజార్)ను ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న చేతి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు, మార్కెటింగ్ ప్రోత్సాహాలు, ఆన్లైన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్‌ను కటకం ప్రసాద్ ప్రారంభించి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, టీఎంసీ భోగేశ్వరరావు, సీఓ వెంకటేశ్వరరావు, నాగమ్మ, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బీపీటీ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలి

కొడాలి(ఘంటసాల): రైతుల నుంచి వచ్చే బీపీటీ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాల్సిందేనని తహసీల్దార్ బి.విజయప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఘంటసాల మండలం కొడాలిలో మిల్లర్లు బీపీటీ ధాన్యాన్ని దించుకోవడం లేదంటూ ఓ రైతు తహసీల్దార్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. తహసీల్దార్ విజయప్రసాద్ మిల్లుకు వెళ్లి ధాన్యం తీసుకోవాల్సిందిగా మిల్లర్లను ఆదేశించి దింపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెట్టకుండా బీపీటీ ధాన్యాన్ని కూడా మిల్లర్లు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌ఐ కె.శ్రీనివాస్, వీఆర్వో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మాని పండుతెగులుపై రైతులకు అవగాహన

చల్లపల్లి(అవనిగడ్డ): వరిలో మాని పండుతెగులుపై రైతులకు అవగాహన కల్పించారు. యార్లగడ్డలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం క్షేత్రస్థాయి వరి పరిశోధన చేశారు. కేవీకే కార్యనిర్వహణ సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకట లక్ష్మి, డాక్టర్ నవీన్ పొలంలో వచ్చిన దిగుబడిని అంచనా వేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణ, ఏడీఏ శ్రీనివాస్, ఏవో పద్మజ, వీఏఏ వైవిక తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావు సేవలు ప్రశంసనీయం

పెడన: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రకాశరావు చూపించిన చొరవ తెగువ ప్రశంసనీయమని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శుక్రవారం చేవేంద్ర గ్రామంలో సీనియర్ రాజకీయ నాయకుడు ఎన్‌కేఎస్ ప్రకాశరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పలువురు నేతలు పాల్గొన్నారు. నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్, వైఎస్సార్ సీపీల్లో సీనియర్ నాయకుడిగా మెలిగారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరగడ్డ శ్రీకుమార్, పిన్నింటి మహేష్, గరికపాటి వెంకటరామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

కృత్తివెన్ను: ఆడపిల్లలకు పెళ్లిపేరుతో బాల్యంలోనే వివాహాలు చేయడం పద్ధతి కాదని అది చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి చెప్పారు. బాల్యవివాహాలపై శుక్రవారం పోడు న్యూ హరిజోన్ సేఫ్ హోం, పోడు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్ట్ యూనిట్‌నుంచి వచ్చిన కిషోర్. పిల్లల అక్రమ రవాణాను వివరించారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు వచ్చినా 1098, 112కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నుంచి సూరిబాబు, వన్‌స్టాప్ సెంటర్‌నుంచి శిరీష, పోడు హెచ్‌ఎం, సేఫ్‌జోన్ చైర్మన్ ఎస్తేర్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

అవనిగడ్డ: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. బెజవాడ ధనసురేష్ దంపతులతో పాటు మొత్తం 50 మంది దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకులు తమిరిశ ఆనందకుమార్, దీవి రఘులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, శాంతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. అనంతరం సుమారు 1200 మందికిపైగా అన్నదానం చేశారు.

రైతుల్లో వణుకు



కోడూరులో వర్షంలోనే ట్రాక్టర్‌పై ధాన్యం తరలింపు



లక్ష్మీనారాయణపురం గ్రామంలో ధాన్యం బస్తాలకు నింపుతున్న రైతులు



వర్షం కురుస్తుండటంతో ధాన్యాన్ని హడావిడిగా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న దేవరకోటలో రైతన్నలు

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. అనావృష్టికి, అతి వృష్టికి తట్టుకుని కాపాడుకున్న పంట అమ్ముకోవడానికి వచ్చే సరికి ప్రభుత్వ నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా వర్షాల నుంచి ధాన్యం కాపాడుకోవడానికి అల్లాడుతున్నారు. శుక్రవారం ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలోని వక్కలగడ్డ వెళ్లే ప్రధాన రహదారి పై రైతులు ధాన్యాన్ని తేమశాతం కోసం ఆరబెట్టుకోగా కురిసిన వర్షం నుంచి కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టాలతో కొంతమేర ధాన్యాన్ని కాపాడుకోగలిగారు. కోడూరు మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి 15వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం 12వేల ఎకరాల్లో పంట కోత దశకు చేరుకుంది. రహదారులపై ధాన్యం రాసులు ఉండటం.. వానలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంటుమిల్లి మండలం ముంజులూరు, కంచడం, బర్రిపాడు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులు రైతులను పరుగులు పెట్టించాయి.

–ఘంటసాల/కోడూరు/బంటుమిల్లి

విద్యార్థులు జీవనశైలి మార్చుకోవాలి



కోనేరుసెంటర్: విద్యార్థులు జీవన శైలి మార్చుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎ ప్రాక్టికల్ అప్రోచ్ టు ఎథిక్స్, ఇంటిగ్రిటీ, అప్టిట్యూడ్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ గ్రంథ విశ్లేషణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించడం, చిన్న చిన్న పెట్టుబడులు పెట్టడం, పలు కోర్సుల్లో చేరి స్కిల్స్ పెంచుకోవడం లాంటి అంశాల పై దృష్టిసారించాలని సూచించారు. ఆంగ్ల భాష పై పట్టు సాధించినప్పుడే పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు ఉంటాయి అని చెప్పారు. శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ శరత్‌చంద్ర గ్రంథాన్ని విశ్లేషించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముదిగొండ శాస్త్రి సభాపరిచయం చేయగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎస్ ఉష వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ దంపతులను ఘనంగా సత్కరించారు.

- కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బుడమేరు వరద బాధితులకు సేవలందించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను అభినందిస్తూ ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీరామ్, సంస్థ సభ్యుడు ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నగరకార్యదర్శిగా బూర సుబ్రహ్మణ్యం

చిలకలపూడి(మచిలీపట్నం): సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శిగా బూర సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏడో మహాసభ నిర్వహించారు. దీనిలో పార్టీ నగర కమిటీని ఎన్నుకున్నారు. సీహెచ్ రాజేష్, టి.చంద్రపాల్, సీహెచ్ జయరావు, ఆర్.వెంకట్రావు, ఎ.రమాదేవి, ఎండీ యూనస్, కొడాలి సుజాత, పేటేటి రాజు, పి. చాందినీదుర్గ, దాసి రాధను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. తొలుత సీపీఎం సీనియర్ నేతలు ధనుంజయరావు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కె.శర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఆత్మీయ కలయిక



జగన్ మోహన్‌రెడ్డితో ఘంటసాల ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ప్రవీణ్, సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో ఘంటసాల ఎంపీపీ వేమూరి రజనీకుమారి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, రుత్విక్ చౌదరి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆప్యాయంగా పలకరించిన జగన్‌మోహన్‌రెడ్డి మండలంలోని పార్టీ పరిస్థితులపై ఆరా తీసి ముందుకు వెళ్లాలని సూచించినట్లు రజనీకుమారి తెలిపారు.

చల్లపల్లిలో శ్రమదానం



చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛ సుందర చల్లపల్లిగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛసైనికుల శ్రమ ఆదర్శనీయమని స్టాండప్ రాహుల్ చిత్ర దర్శకుడు వీరంకి సంతోష్ మోహన్ అన్నారు. చల్లపల్లిలోని 216 జాతీయ రహదారి వెంట చేపట్టిన స్వచ్ఛ సుందర చల్లపల్లిలో శుక్రవారం ఆయన పాల్గొని శ్రమదానం చేశారు. కోడూరు మండలం కుమ్మరిపాలెంకు చెందిన సంతోష్‌మోహన్ తమ మిత్ర బృందంతో కలసి స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారి ప్రక్కన ఉన్న పిచ్చిమొక్కలు, చెత్త, మట్టిని తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బంటుమిల్లి శ్రీ గంగ, పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి, పెదతుమ్మిడి శ్రీ పార్వతి సేమత అగస్త్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు లక్ష బిల్వార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అర్తమూరు శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపోత్సవం, ముంజులూరు గ్రామం సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో దీపోత్సవం, అన్నసమారాధన చేశారు.

సందడిగా వనభోజనాలు

మోపిదేవివార్పు(మోపిదేవి): స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మోపిదేవివార్పు వద్ద మామిడి తోటలో శుక్రవారం వనభోజనాలు చేశారు. పచ్చని చెట్ల మధ్య చల్లని వాతావరణంలో ఉదయం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. తెలుగు వంటకాలతో తయారుచేసిన భోజనం చేశారు. ఎంఈవో దుర్గాసాగర్, పాఠశాల ప్రిన్సిపాల్ వీరరవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఐక్యంగా కృషి

ఎంయూడీఏ చైర్మన్ మట్టా ప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం ప్రాంత అభివృద్ధికి కూటమి నేతలతో కలిసి పనిచేస్తానని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. ఎంయూడీఏ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ బీజేపీలో కార్యకర్తగా పనిచేసి ఎంయూడీఏ చైర్మన్ స్థాయికి తీసుకొచ్చిన ప్రతి కార్యకర్త తాను చైర్మన్ కావడంలో భాగస్వాములయ్యారన్నారు. పోర్టు కల నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. అక్రమ లేఅవుట్లు, మట్టి తవ్వకాలు వీటన్నింటిపై చర్యలు చేపడతామన్నారు. ఎంయూడీఏ పరిధిలో ఎవరైనా ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా మల్లయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బి.మల్లయ్య ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన చంద్రలీల ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో పోస్టింగ్ కోసం వేచి ఉన్న మల్లయ్యను నియమించారు.

దాడి కేసులో నిందితులకు రెండు రోజుల కస్టడీ

పెడన: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేనిపై దాడి కేసులో అరెస్టై రిమాండ్లో ఉన్న ఎనిమిది మందిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ గన్నవరం కోర్టు గురువారం ఉత్తర్వులు ఇవ్వడంతో వారిని శుక్రవారం రాత్రి పెడన పీఎస్‌కు తీసుకువచ్చారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద కాసరనేనిపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది వ్యక్తులను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసు పునఃవిచారణ పేరుతో గుర్రం అంజయ్య(నాని), కర్నాటి నిరంజన్, ఓలుపల్లి మోహన్‌రంగా, మేదినేని బాబు, అనగాని రవి, గోనూరు సీమయ్య, భీమవరపు యతేంద్ర రామకృష్ణ(రాము), సూరపనేని అనిల్‌కుమార్‌లను నిందితుల జాబితాలో చేర్చారు. వీరిని ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అదనపు విచారణ కోసం నిందితులను కస్టడీకి కోరుతూ గన్నవరంలోని 8వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. వాదనల అనంతరం రెండు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగించడానికి కోర్టు అనుమతించింది. దీంతో శుక్రవారం రాత్రి పెడన పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పెడన పోలీస్ స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశు గర్భోత్పత్తి సమస్యల నివారణే లాభదాయకం

గణపేశ్వరం(నాగాయలంక): పశువుల్లో గర్భోత్పత్తి సమస్యల నివారణతో పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పశు సంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగభూషణం చెప్పారు. ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యాన గణపేశ్వరం శివారు బర్రంకులలో శుక్రవారం పశు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం జరిగింది. శిబిరంలో 300పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 56 పశువుల్లో గర్భకోశ సమస్యలను పరీక్షించారు. సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, మండల పశు వైద్యాధికారి సీహెచ్ సాయిమౌనిక, డాక్టర్ హరిత(డీఎల్‌డీఏ-గన్నవరం), వేకనూరు పశు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, గ్రామస్తులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి-వెంకటాపురం రోడ్డుకు మరమ్మతులు

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి-వెంకటాపురం రహదారికి మరమ్మతులు చేపట్టారు. వీటికోసం రూ.53 లక్షల నిధులు మంజూరవ్వగా, శుక్రవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బీ డీఈఈ రమేష్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పనులను పర్యవేక్షించారు.

ఆలయాల్లో కార్తిక శోభ



18కిలోల కార్తిక వత్తిని వెలిగిస్తున్న పూజారి సాయిస్వామి

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద శ్రీగంగ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరునికి శుక్రవారం రాత్రి 18కిలోల అఖండ వత్తి దీప జ్యోతితో పలికిన నీరాజనం వైభవోపేతంగా జరిగింది. మూడున్నర అడుగుల ఎత్తు కలిగిన ఈ వత్తి 24గంటల ముందుగా నానబెట్టేందుకు 60కిలోల నూనెను వినియోగించినట్లు నిర్వాహకులు చెప్పారు. అలాగే లక్ష మారేడు దళాలతో భక్తులచే స్వీయ రామలింగేశ్వరార్చన జరిపించారు. బాపట్లలోని సాయిబాబా మందిరం పూజారి సాయిస్వామి ప్రత్యేకమైన భారీ వత్తి, నూనె మొత్తం తీసుకొచ్చి వరుసగా రెండో సారి సమర్పించారు.

పెడన: స్థానిక శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో, శ్యామలాంబ దేవాలయంలో శుక్రవారం సహస్రదీపాలంకరణ చేశారు.

- స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారు స్ఫటికేశ్వరుడిగా ధగధగా మెరిసిపోవడంతో భక్తులు నగరేశ్వరుని అలంకార సౌందర్యానికి మురిసి పోయారు. ఆలయ కమిటీ సౌజన్యంతో 1008 స్ఫటిక మాలలతో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి నాగాయలంక పురవీధుల్లో భక్తులు ఆధ్యాత్మిక ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటసాల: బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి వార్లకు శుక్రవారం భారీ అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు.

చల్లపల్లి(అవనిగడ్డ): నడకుదురు పృథ్వీశ్వరస్వామి ఆలయంకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఉసిరి వనంలో వనభోజనాలు చేశారు.

కృత్తివెన్ను: గాంధీనగరం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామివారి ఆలయం వద్ద కోటిదీపోత్సవం, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలు ఎంతో వైభవంగా నిర్వహించారు.

మాటలకే 'మంత్రి' పరిమితం!



గురువారం గూడూరులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)



శుక్రవారం వానలో పరదాల మాటున.. గురువారం మంత్రి మనోహర్ పరిశీలించిన ధాన్యం రాశులివే

నీటి ముంపులోనే ధాన్యం రాశులు

గూడూరు: గూడూరులో ధాన్యం రాశులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం పరిశీలించారు. 17.1 తేమ శాతం ఉందని రైతులు రైతు సేవా కేంద్రం టెక్నికల్ అసిస్టెంట్ చెప్పగా... మీరేం భయపడాల్సిన పనిలేదని, ఇప్పుడే మీ పంట ప్రభుత్వం సేకరిస్తుందని రైతుకు హామీ ఇచ్చారు. గురువారం గడిచింది... శుక్రవారం కూడా గడిచిపోయింది... ఇప్పటికీ ధాన్యం రాశులు ఇలా రోడ్డుపైనే కనిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిన్నపాటి వర్షం మొదలు కావడంతో కలవరపాటుకు గురైన రైతులు పరదాలతో పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి వెంబడి అడుగడుగునా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి.

సమష్టి కృషితో పాఠశాలల అభివృద్ధి

పెడన: సమష్టి కృషితో పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని పెడన మండల విద్యాశాఖాధికారి -1 దుర్గాప్రసాద్ అన్నారు. భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తొలుత మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌పై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎంఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అందరూ క్రమం తప్పకుండా ఆయా కార్యక్రమాలను బాధ్యతగా చేయాలని ఆదేశించారు. ఏడో తేదీ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహణకు సంబంధించి ముందు నుంచే ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అందరూ షెడ్యూల్ ప్రకారం పక్కాగా అమలు చేయాలన్నారు. 7న జరిగే కార్యక్రమానికి సంబంధించి రిసోర్స్ పర్సన్‌గా చెన్నూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సౌజన్య వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై దాడులు

కృత్తివెన్ను: నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కృత్తివెన్ను ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. పోడు గ్రామంలో శుక్రవారం సముద్రం ఒడ్డున ముళ్లపొదల్లో సారాకాస్తున్న శిబిరంపై దాడులు చేశామన్నారు.